# రింగ్ మాస్టర్



వనజ చాలా రోజులుగా గమనిస్తోంది. మురళి ఏగాలుగా వుంటున్నాడు. 'వాడికి తనేం తక్కువ చేస్తోంది?' అని చాలాసార్లు ఆలోచించింది.

బ్రష్‌మీద పేస్ట్ వేసుకోవడం అన్న చిన్నపని తప్పితే వాడేపనీ చేయక్కర్లేదు. ఉదయం లేవగానే స్నానం, బ్రేక్‌ఫాస్ట్..ప్రైవేట్..ఎనిమిదిన్నరకి స్కూలుకి తయారవడం. పుస్తకాలు బాగ్ కూడా డ్రైవర్ తీసుకెళ్ళి కారులో పెడతాడు. మధ్యాహ్నాం లంచ్‌కి ఇంటికే వస్తాడు. సాయంత్రం పనికుర్రాడితో పార్క్‌కెళ్ళి ఆడుకుని ఆరున్నర ప్రాంతాల్లో పుస్తకాలు తీస్తాడు. తర్వాత భోజనం, నిద్ర. చాలా సుఖవంతమైన జీవితాన్ని అందిస్తున్నా వాడిలో ఆ నిర్లిప్తత ఏమిటి? మొన్నీమధ్యనే భర్త ట్రైనింగ్‌కి ముస్సోరీ వెళ్తూంటే తనూ వెళ్తూ వాళ్ళ నాన్నమ్మ దగ్గర ఆరునెలలు విడిచి పెట్టింది. ఆ పల్లెటూరికి దగ్గర్లోనే వున్న పట్నంలో కాన్వెంట్‌కి రోజూ ఇంటిదగ్గరనుంచి వెళ్ళి రావడం..ఆ శ్రమ కూడా లేదిప్పుడు. ఆ ముసలావిడ పెంపకం...తన పెంపకం మధ్య తేడా వాడిని కలవరపరుస్తోందా? షీర్ నాన్సెన్స్...ఏముందక్కడ? మట్టీ..బురదా..కట్టెల పొయ్యిలు..బొంగరాలు...గోటీబిళ్ళా..ఆ మురికిలోంచి ఇంత శుభ్రమైన వాతావరణంలో గడుపుతూ కూడా వాడు బెంగపడటంలో అర్థంలేదు. మిస్అవుతున్న నానీ ప్రేమా అంటే నాన్నమ్మని పెద్దగా తల్చుకోడు మళ్ళీ.." ఆలోచిస్తున్న వనజ కారు శబ్దానికి లేచి వాకిట్లోకి వచ్చింది.

కార్లోంచి ప్రపంచంలో వున్న భారమంతా తనే మోస్తున్నట్లు చాలా భారంగా, నీరసంగా, దిగాడు మురళి. ఈడుస్తున్నట్లుగా నడిచి లోపలకొచ్చి సోఫాలో కూలబడిపోయి తల్లివైపు ఓసారి చూద్దామనుకొని ఆ ప్రయత్నం విరమించుకుని బాత్‌రూమ్‌లోకెళ్ళిపోయాడు.

స్నానం చేసొచ్చేసరికి వనజ బిస్కెట్స్, కేకులు పళ్ళెంలో సర్ది కోకో డ్రింకు కలుపుతోంది.

వాటిని చూడగానే మురళి మొహం వెగటుగా మారింది.

"నాకు ఇలాంటివి ఇష్టం వుండదు అమ్మా..." చివరి మాట అంటూండగా తల్లి మొహంలో తీవ్రతని గమనించి "మమ్మీ..." అంటూ కలిపాడు.

"పెద్దవాడివవుతున్నావు. బలమిచ్చే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి. అప్పుడే నువ్వు సూపర్‌మాన్‌లా..."

అప్పటికే అక్కడలేడు మురళి. బైటకి పరిగెత్తి లాన్‌లో ఆడుకుంటున్న కుక్కపిల్లని చేతుల్లోకి తీసుకున్నాడు. వాడికి చాలా ఆకలిగా వుంది. కానీ ఆ పదార్థాలు తినబుద్ధికావడం లేదు. "అదే నానీ అయితే చక్కగా జంతికలు, చేగోడీలు పెట్టేది. ఎంత బావుండేవో అవి. అవి కొంచెం, రెండు కేకులూ పెట్టొచ్చు కదా..."

వనజ వాడి వెనకే వచ్చింది.

"మాట చెప్తూంటే పరుగెత్తుకొచ్చేస్తావేమిటి? బొత్తిగా మానర్స్ మర్చిపోతున్నావు. ఆ కలువగొలనులో వుంచడం బుద్ధితక్కువలా వుంది. ఆ కుక్కపిల్ల వంటిమీద మట్టి చూసావా? బోలెడు పురుగులు వుంటాయి..చేతులు శుభ్రం చేసుకుని టిఫిన్ తిను.."

తల్లంటే భయం మురళికి. ఆ కళ్ళెప్పుడూ ఆజ్ఞ జారీ చేస్తున్నట్లుంటాయి. మాటలు ముళ్ళల్లా వుంటాయి. స్నేహితులు అందరూ వనజని మెచ్చుకుంటారు...కొడుకుని చాలా క్రమశిక్షణగా, పద్ధతి ప్రకారం పెంచుతుందని.

బలవంతంగా తినడం పూర్తిచేసి "పార్క్‌కెళ్తాను..." అన్నాడు మురళి.

"వర్షం వచ్చేటట్లుంది. ఇప్పుడేం పార్క్? లారెల్ హార్డీ సినిమాలు చాలా బావుంటాయి" అంది వీడియో కాసెట్ తీస్తూ.

ఆ సినిమాలు పూర్తిగా అర్థంకావు మురళికి. పప్పెట్స్..జూలో జంతువులు...చిన్న చిన్న స్నేహితులు ఆ సర్కిల్ నుంచి ఇంకా బైటకి రాలేని పసివాడు. అది అర్థం చేసుకోదు వనజ. క్రమశిక్షణ..ప్రతీక్షణం క్రమశిక్షణ అనే కనబడని పంజరంలో కొడుకుని పడేసి తృప్తిపడుతూ వుంటుంది.

అయితే తల్లిమీద భయంతో గంటసేపు ఉగ్గబట్టుకుని కూర్చున్నాడు మురళి. మనసులో పార్క్‌కెళ్ళాలన్న కోరిక చాలా తీవ్రంగా పనిచేస్తోంది. 'బోలెడు మంది పిల్లలొస్తారు. చక్కగా ఆడుకోవచ్చు. అయితే వేసుకున్న బట్టలు మాయకుండా...చేతులు మురికి కాకుండా చాలా శుభ్రంగా. వర్షం వచ్చేముందు ఎంత బావుంటుందో!' సినిమా ఆఖరి సన్నివేశంలో బైటకొచ్చేసి అప్పుడే మెల్లగా రాల్తున్న ముత్యాల్లాంటి చినుకుల్ని దోసిట్లోకి తీసుకుంటూ తూనీగలా పరుగులు పెడుతున్నాడు.

"బబ్లూ.." కొరడా ఝుళిపించినట్లు తల్లిస్వరం వినగానే వాడిలో చురుకుదనం..ఆనందం ఒక్కసారి గడ్డకట్టుకుపోయాయి. వాననీటిని వేళ్ళ సందుల్లోంచి నేలమీదికి జార్చేసి బరువుగా అడుగులు వేసుకుంటూ లోపలికి వచ్చాడు.

"వానలో తడిస్తే జలుబు చేస్తుంది. ఒరేయ్...కిట్టూ...పడవలు చెయ్యరా.. కాస్సేపాగి నీళ్ళలో వేద్దువుగాని."

గ్రిల్‌ని కవర్‌చేస్తూ వున్న అద్దాల తలుపులకి చెక్కిళ్ళు ఆనించి చాలా నిస్సహాయంగా చూస్తూ నిలబడ్డాడు మురళి. వాడికి ఉక్రోషంగా వుంది. ఆ బాధని మాటల రూపంలో వ్యక్తపరిచే వయస్సుంటే "రెక్కలు కత్తిరించి ఎందుకమ్మా ఈ పంజరంలో బంధిస్తావు? అనడిగి వుండేవాడు.

ఆ 'షో' చూపించినందుకు వనజ చాలా సంతృప్తి పడుతూ సోఫాలో కూర్చుంది.

"ఊ..ఆరున్నర...వెళ్ళి పుస్తకాలు తియ్.."


హోమ్‌వర్క్‌లు..చదువు..ఎనిమిదిన్నరకి భోజనం. చాలా శ్రద్ధగా తీసుకుంటుంది వనజ.

ఉడికించిన కోడిగుడ్డు...ఆకుకూర వేపుడు..కారెట్ కూర...పప్పు.

మురళికి ఆమ్లెట్ అంటే ఇష్టం. రోజూ ఎలా వున్నా అప్పుడప్పుడు ఆవకాయి..మాగాయిలాంటివి తినాలని వాడికి. ఒక్కరోజు మెత్తబడి వాడి మాటలు వింటే పేచీపెట్టడం నేర్చుకుంటాడేమోనని వనజ భయం.

కాస్సేపు చదువు. మళ్ళీ కాడ్‌లివర్ ఆయిల్ కాప్స్యూల్స్. పడుకోబోయేముందు గ్లాసుడు పాలు.

బలవర్ధకమైన ఆహారమివ్వడంలో తప్పులేదు. కానీ రెండ్రోజులకోసారైనా వాడికిష్టమైన వంటకం ఒక్కటి కూడా పెట్టదు వనజ.




తొమ్మిదికి తల్లితండ్రులిద్దరికీ 'గుడ్‌నైట్' చెప్పి పడుకోవాలి.

"గుడ్‌నైట్ బబ్లూ.." అంటూ దుప్పటి కప్పి, బుగ్గ మీద ఓ ముద్దు పారేసి వెళ్ళిపోతుంది వనజ. వంటరితనం..భయంతో పోరాడి పోరాడి నిద్రకువక్రమిస్తాడు మురళి.

ఒక్కడే పడుకుంటే ఆత్మవిశ్వాసం కలుగుతుందని వనజ ఉద్దేశ్యం. కానీ నిద్రపోయేవరకు పక్కనే పడుకుని ఆమాటా ఈమాటా చెప్తే వాడంత వంటరితనం ఫీలవడు.

ఆడుకోవడానికి చాలా బొమ్మలు, మంచిబట్టలు, తిండి, తల్లిగా తను తీసుకుంటున్న శ్రద్ధ, క్రమశిక్షణ తల్లిగా తన పాత్ర బాధ్యతాయుతంగా నిర్వర్తించానను కుంటుంది వనజ. అయితే మురళి కోల్పోతున్నదేమిటో ఆమెకి అర్థంకావడం లేదు.

జూలో జంతువులూ బ్రతుకుతున్నాయి. వాటి మనసుల్ని పరిశీలిస్తే ఎలాంటి భావాలు కనబడతాయి? ఓ బందిఖానా పరిధిలో గుడుగుడు కుంచం..తిరుగుతూ..మొదట్లో రగిలీ రగిలీ ఆరిపోయిన కసి, తర్వాత రాజీ...నిర్లిప్తత.. దేనికైతే అవి ఎక్కువ భయపడతాయో, పారిపోతాయో...ఆ మనుమ్యలు చువ్వల వెనుక నిలబడితే...మొదట్లో ఆ చిన్న బోనులో ఓ మూలకి ముడుచుకుపోతూ...ఏడుస్తూ గడిపే కోతులు, పక్షులు వాటికి ఆహారం, రక్షణ సమస్యలేదు. కానీ నిజమైన ఆనందమూ లేదు. వాటికే నోరుంటే శాపనార్థాలు పెడతాయి.

వాటికీ, ఈ రాకెట్ యుగంలో పిల్లలకీ పెద్ద తేడాలేదు. ఆధునికత పేర్న చాలా చిన్న పరిధిని సృష్టించే తల్లితండ్రులు ఉప్పుబస్తాల్లాంటి పుస్తకాల పెట్టెల బరువు, చదువు భారం, కదిలినా, మెదిలినా 'మేనర్స్' అనబడే 'బ్రేకర్స్'..

వాళ్ళ చిన్ని జీవితాల్లో సహజత్వం ఎక్కడుంది? రెక్కలు కత్తిరించిన పక్షుల్లా మిగుల్తున్నారు!

ఈ స్పీడ్ యుగంలో పరుగుపందానికి పిల్లల్ని తయారు చెయ్యాలి. తప్పదు..అయితే మరీమరీ కృత్రిమ పోకడలతో కాదు. కుహనా నాగరికతతో పిల్లలు కొలిచే కొలబద్దలు కాకూడదు.

ఆరోజు చాలా తొందరగా మురళికి భోజనం పెట్టి, మేడమీదకి పంపేసి, క్రిందకి దిగి రాకూడదని హుకుం జారీ చేసింది వనజ. ఇంట్లో పార్టీ జరుగుతోంది. అదీకారణం.

మురళికి నిద్ర రావడంలేదు. కలువగొలనులో పెళ్ళిళ్ళు, పేరంటాలు గుర్తుకొస్తున్నాయి.

'మేనాలో పెళ్ళికూతురు..వెనకే పళ్ళాలు పట్టుకుని ఆడవాళ్ళు..ఆ పళ్ళాల నిండా రంగురంగుల పంచదార చిలకలు...స్వీట్స్..పాలకోవా గుమ్మడికాయలు...గాస్‌లైట్ల వెలుతుర్లో ఆ ఊరేగింపులో కల్సిపోయి నడుస్తూంటే ఎంత బావుంటుంది! ఓసారి ఓ పెళ్ళికొడుకు చెమ్కీ దండ ఇచ్చాడు తనకి. అది తన మెడలో వేసుకుని తిరుగుతూంటే ఎంత గొప్పగా అన్పించిందో!

పేరంటంకెళ్తే తనకీ గంధం పూసేవారు. సిగ్గుతో నానీ మెత్తని సిల్క్‌చీర కుచ్చిళ్ళ మధ్య తలదాచుకుంటే సర్దాగా వుండేది. ఇంట్లో పార్టీ అట. అంటే పేరంటాళ్ళందరూ వస్తారేమో! తనెందుకెళ్ళకూడదు! ఇంట్లో పేరంటానికి పిల్లలు లేకుండా మాయమైపోతారా? పోనీ తనకి చెల్లాయో, తమ్ముడో వుంటే ఎంత బావుండును. వున్నా తలా ఒక గదిలోకి పంపేస్తుంది మమ్మీ...ఉరుములు, మెరుపులంటే భయం. ఆ భయాన్ని వదిలెయ్యాలంటుంది మమ్మీ. చిన్నపిల్లలకి భయం వుండదేమిటి పెద్ద? పెద్దయితే తనూ బోల్డు భయం లేకుండా వుండగలడు.

ఆ.... ఉక్రోషంగా కళ్ళు తుడుచుకున్నాడు.

చాలాసేపు నడిమంచంమీద బొమ్మలా కూర్చున్నాడు. నిద్రపట్టనివ్వని ఆసక్తితో మెల్లగా మెట్లుదిగి హాల్లోకి వచ్చాడు.

చీరలు, గౌన్లు...సూట్లు...

'ఆవిడ అమ్మేనా? అమ్మ...అలా వుందేమిటి? నడినెత్తిన ముడి..అసయ్యంగా జబ్బలు లేని జాకెట్..ఎవరాయన? ఆయనతో అమ్మకి డాన్సేమిటి?' వింతగా చూస్తూ నిలబడిన మురళిని చూసింది, మిసెస్ మిత్రా.

"ఓహ్...డియర్ నాజ్...ఏమిటి నీ కొడుకునంత కేర్‌లెస్‌గా వదిలేస్తున్నావు?" అంది ఇంగ్లీష్‌లో చాలా బాధనడిపోతూ.

వనజ మూడ్ అంతా మారిపోయింది. విసురుగా వచ్చి, వాడ్ని బరబరా మేడమీదకి లాక్కుపోయి, వళ్ళు తెలియని కోపంతో పశువులా బాది, బైట తలుపులు గడియ వేసుకుని వెళ్ళిపోయింది.

నేలమీద కూలబడి వెక్కివెక్కి ఏడ్చాడు మురళి. లైటువేసి అద్దంలో చూసుకున్నాడు. చెక్కిళ్ళు ఎర్రగా కందిపోయాయి. చెవి అంచులు కారం పూసినట్లు మండుతున్నాయి. కసితో వాడి మనసు రగిలిపోతోంది.

ఏదో ఒకటి చెయ్యాలి. ఏమిటది? నోట్‌బుక్‌లో కాగితం చింపి దయ్యంమీద తనకున్న అవగాహనను ఒక రూపంలోకి తీసుకొస్తూ రాక్షసి బొమ్మ వేసాడు. దానిక్రింద "మమ్మీ....డెవిల్" అని రాసాడు. ఆ కాగితాన్ని గుండెలకానించుకుని ఏ తెల్లారు ఝామునో నిద్రలోకి జారిపోయాడు.

ఆ సంఘటన తర్వాత మరీ ముభావంగా తయారయ్యాడు మురళి.

ఆరోజు పల్లెనుంచి పాలేరు ఏవో తీసుకొచ్చాడు. అతన్ని చూడగానే 'కోటా' అంటూ ముందుకెళ్ళబోయిన మురళిని చూపుల్తో బ్రేక్ వేసింది వనజ.

మురళి ఓసారి నిరసనగా తల్లివైపు చూసి లోపల కెళ్ళిపోయాడు.

ఆ మధ్యాహ్నం భోజనం చేసి తిరుగు ప్రయాణమయ్యాడు కోటయ్య.

'కోటా.. అరుస్తూ బస్సు లోపలకొచ్చిన మురళిని చూసి నిర్ఘాంతపోయాడతను.

కోటయ్య కంగారుపడి, ఏదో చెప్పబోతుంటే "అమ్మకి చెప్పే వచ్చాను" అని అబద్ధం చెప్పేసి నిశ్చింతగా ఆనందంగా అతన్నానుకుని కూర్చున్నాడు మురళి.

చిలకలా ఒకటే కబుర్లు. "రాముడెలా వున్నాడు?"

రాముడంటే లేగదూడ. అదంటే ప్రాణం మురళికి.

"మన మిల్లు దగ్గరికి పావురాళ్ళు వస్తున్నాయా?" "మీ బాతులు ఎంతున్నాయి?" "మున్నబుగారి జాతి కుక్క ఎంతయింది?" ఒకటే ప్రశ్నలు. అనర్గళంగా వాకబుచేసి చాలా చాలా సంతోషపడిపోయాడు వాడు.

ఆ సాయంత్రం మురళి ఎంతకీ రాకపోవడంతో అంతా వెతికి, ఆఖరి ప్రయత్నంగా దడదడలాడుతున్న గుండెల్తో అర్థరాత్రి కలువగొలను పరుగెత్తుకొచ్చారు మురళి తల్లితండ్రులు.

"రేయ్ బబ్లూ...నన్ను కాపాడరా? ఒక్కసారి కనపడరా? నన్ను శిక్షించకురా.." కుమిలి కుమిలి ఏడుస్తోంది వనజ.

ఆమెకు ఆ ఎత్తు అరుగులున్న మండువాలోగిలి ఎప్పట్లా చిరాకన్పించడంలేదు. తన పెన్నిధిని దాచుకున్న కోటలా వుంది.

లోపలికి పరిగెత్తింది. అక్కడ దృశ్యం చూసి నవ్వాలో, ఏడవాలో, ఆగ్రహంతో రెచ్చిపోవాలో అర్థం కాలేదామెకి.

చాలామంది పిల్లలు సావిట్లో కూర్చుని వున్నారు. వాళ్ళ మధ్య హుషారుగా కిలాకిలా నవ్వుతూ మురళి ఏక్షన్ చేస్తున్నాడు.

"ఇదుగో నానీ...లేవగానే ఇలా మెల్లగా మెట్లుదిగి "గుడ్‌మార్నింగ్ మమ్మీ" అనాలి. తర్వాత స్నానం అవీ అయిన తర్వాత మరేమో అనయ్యంగా బ్రెడ్...జామ్...వెన్న...చప్పుడు చెయ్యకూడదు. టేబుల్‌కి మోచెయ్యి తగలకూడదు. ఊరికే గెంతులెయ్యకూడదు. అదికాగు నానీ...నేననలు అల్లరి చేస్తానా నువ్వయినా చెప్పు? ముంజెలు చక్కగా తినొచ్చు కదా. వాటిని చిన్నముక్కలు చేసి, పంచదార జల్లి, ఫ్రిజ్‌లో పెట్టి, స్పూన్‌తో కొద్దిగా తినాలి. మామిడి పళ్ళూ అంతే. ఎప్పుడూ బిస్కెట్లు, కేకులు. పార్కుకెళ్తానా...నానీ...ఇదుగో...ఇలా నానీ...."

గొల్లున నవ్వులు. చెప్తున్న మురళి మొహంలో కాంతి, నిశ్చింత..ఆనందం. పురివిప్పిన నెమలి, గాల్లో హాయిగా విహరిస్తున్న తూనీగ, నీళ్ళల్లో కదిలే వెండి చేపపిల్ల...గుర్తుకొస్తున్నాయి వనజకి, వాణ్ని చూస్తూంటే.

తన దగ్గర తోకకి బండరాయి కట్టిన తూనీగలా, రెక్కలు విరిచిన పక్షిలా, మూగవోయిన మురళి...తను క్రమశిక్షణ పేరిట గీతలు గీస్తూ వాడికన్యాయం చేసిందా?

'అత్తగారు గట్టిగా నవ్వుతూ అంటోంది. "మరీ నిన్ను సర్కస్‌లో జంతువుని చేసిందిరా మీ మమ్మీ.."

'వాడు సర్కస్‌లో జంతువు...అయితే తను..తను..రింగ్‌మాస్టర్...."

వనజ కళ్ళల్లో నీళ్ళు. కోతులాడించేవాడు..అది మొండికేస్తే ఒక్కోసారి ఆహారం పెడతాడు..ఒక్కోసారి కొడతాడు కూడా. అది నిస్సహాయంగా, నిర్బలంగా ఫీట్స్ చేస్తూ వుంటే...తన కొడుకూ అదే స్థితిలో వున్నాడా?

"ఇలా వచ్చి కూర్చో కన్నా...ఎంతసేపలా నిలువుకాళ్ళ మీద నిలబడతావు?" ముసలావిడ గొంతులో చిప్పిల్లుతున్న ఆప్యాయత.

ఆవిడ ఒడిలో సింహాసనం మీద రాకుమారుడిలా మురళి, వాడి కళ్ళల్లో...ధీమా...నిశ్చింత...హాయి.

తను చేసిన తప్పేమిటో అర్థమవుతోంది వనజకి.

---

**రచయిత్రి చిరునామా:**
**జె. స్వర్ణలత**
**w/o. డా॥ జె.ఏ.వి. ప్రసాదరావు**
**8-193/1, విద్యానగర్**
**రాజమండ్రి - 533 105**



# మహాశివరాత్రీ మహాత్మ్యమ్

మాసానికో సంక్రాంతి వచ్చినట్టే మాసానికో శివరాత్రి వస్తుంది. మకరసంక్రాంతిని పెద్ద పండుగగా మనం జరుపుకుంటున్నట్టే మాఘ బహుళ చతుర్దశిని మహాశివరాత్రిగా జరుపుకుంటున్నాం.

'సర్వకామప్రదం కృష్ణ చతుర్దశ్యాం శివరాత్రమ్' అని స్మృతులు అంటున్నాయి. మాస శివరాత్రికే అంతటి విశిష్టత ఉండగా మహాశివరాత్రి గురించివేరే చెప్పాలా?

పరమశివుడు మాఘకృష్ణ చతుర్దశి రోజున మహానిశీధి సమయంలో కోటి సూర్యుల కాంతితో శివలింగ రూపంలో ఆవిర్భవిస్తాడు. ఆరాత్రి శివునికి చాలాప్రియమైన రాత్రి గనుక 'శివప్రియ' అని కూడా ఆ రాత్రిననడం జరుగుతుంది. సర్వేసర్వత్రా శివలింగాలన్నింటిలోనూ శివప్రియారూపమైన ఆరాత్రికి పరమేశ్వరుని దివ్య తేజస్సునిండిపోతుంది.

—అందువల్లనే మాఘకృష్ణ చతుర్దశి శివరాత్రుల్లో కెల్లా మిన్నయై మహాశివరాత్రిగా వెలుగొందుతూ ఉన్నది.

శివరాత్రిని గురించి ఇలాచెప్పారు—

శివునికి ప్రియమైనటువంటిదై, ఆయన్ని ఉపాసించడానికి గాను ఉద్దేశించబడినదైనరాత్రిని శివరాత్రి అంటారు. మాఘమాసంలోని కృష్ణచతుర్దశి రాత్రేవ్రత పూజాదికాలు జరుపబడతాయి. కనుక ఆ రాత్రే శివునికి ప్రియమైనది.

ఇక ఇప్పుడు 'శివరాత్రి' శబ్దానికి అర్థం చెప్పుకోవాలంటే మూడు రకాలుగా చెప్పుకోవచ్చు. 'శివరాత్రీవ్రతమనీ', 'మాఘకృష్ణచతుర్దశీతిధి' అనీ, 'మాఘకృష్ణ చతుర్దశిరాత్రి' అనీ మూడు అర్థాలు వస్తున్నాయి!

శివరాత్రీవ్రత విధానాన్ని శివపురాణమిలా విశదీకరించింది—

'శివరాత్రి రోజున ఉపవాసముండి రాత్రినాలుగుయామముల లోనూ పార్థివలింగానికి పూజాభిషేకాలొనర్చి ఆయా జాముల్లో చెప్పబడిన రీతిలో శాకదాన ఫలములను నివేదించి పంచాక్షరీమంత్రాన్ని క్రమవృద్ధితో జపించి పార్థివలింగాన్ని పూజించి శాస్త్రయుక్తంగా విసర్జించి. శివభక్తులకు దాన భోజన దక్షిణాదులను సమర్పించాలి.'

అభిషేక విధి విషయానికొస్తే అది ఇలా ఉంటుంది—

'దుగ్ధేన ప్రథమేస్నానం దధ్నాచైవ ద్వితీయకే
తృతీయ యేచ తథాజ్యేనచతుర్థేమధునాతథా' అని.

రాత్రిమొదటి జాములో పాలతోనూ, రెండోజాములో పెరుగుతోనూ, మూడోజాములో నెయ్యితోనూ, నాలుగో జాములో తేనెతోనూ అభిషేకం జరపాలన్నమాట!

ఉపవాస విధిగురించి ఇలాచెప్పారు—

'నస్నానేన నవస్త్రేణ నధూపేవ నచార్చయా. తుష్యామి నతథా పుష్పైఃయథాతత్రోపవాసతః అని.

ఉపవాసానికీ, శివరాత్రివ్రతానికీ గలసంబధం విడదీయరానిది. ఈ రోజున ఉపవాసానికున్న ప్రాముఖ్యత గొప్పది. అలాగే జాగరణకూ అత్యంత ప్రాముఖ్యత ఇవ్వబడింది.

శివరాత్రి వ్రతాన్ని జరుపకపోయినా — భక్తిపూర్వకంగా జాగరణం ఎవరు చేసినా వారు రుద్ర సములు కాగలరని స్మృతి వచనం.

'కశ్చిత్పుణ్య విశేషేణ వ్రతహీనా ౨ ప్రియాః పుమాన్
జాగరం కురుతే తత్ర సరుద్ర సమతాం వ్రజేత్
అన్నారు.

శివరాత్రీవ్రత మహాత్మ్యాన్ని నారద సంహిత ఇలా చెప్పింది—

అర్థరాత్రియుతా యత్ర మాఘ కృష్ణ చతుర్దశీ
శివరాత్రి వ్రతం తత్రసో అశ్వమేధఫలం ల భేత్.
— అని!

స్కాంధపురాణం శివరాత్రి వ్రతాన్ని నాలుగు విధాలుగా చూపింది—

ప్రతి అహమూరాత్రి నాలుగుయామములూ నియమనిష్ఠలతో పరమశివుని పూజించడం నిత్య శివరాత్రి వ్రతమనీ ప్రతినెలా కృష్ణచతుర్దశి రోజున ఉపవాసముండి రాత్రి నాలుగు యామములూ శివారాధన చేయడం మాసశివరాత్రివ్రతమనీ, సోమవారంతో అమావాస్య తిథి కలిసిన రోజున ఉపవాసముండి శివుణ్ణి పూజిస్తే అది యౌగిక శివరాత్రి వ్రతమనీ, మాఘమాస కృష్ణపక్షచతుర్దశిరోజున ఉపవాసముండి పరమేశ్వరుని ఆరాధిస్తే మహాశివరాత్రి వ్రతమనీ స్కాంధపురాణం చెబుతున్నది!

ధర్మశాస్త్రాలూ, పురాణాలూ, స్మృతులూ మాఘకృష్ణ చతుర్దశే మహాశివరాత్రి అని చెప్పగా ఒక్క భవిష్యపురాణం మాత్రం మార్గశిర శుక్ల త్రయోదశి రోజున 'శివ చతుర్దశీ వ్రతం' చేయాలని చెప్పింది. ఈ పురాణంలో ఈ విషయమిలా ఎందుకు భేదించిందో అర్థంకాదు.

ఏది ఎలాగున్నా శివరాత్రీవ్రతాన్నాచరించిన గజానన షణ్ముఖులు గణాధిపత్యాన్ని పొందారు. మరుధ్వరులు బలశాలులైనారు. త్రివిక్రమ ధాతృసూత్రములు విష్ణుత్వ, బ్రహ్మత్వ, త్రివిష్టసాధిపత్యమును పొందారు. ఈగాథలన్నీ మహాశివరాత్రీవ్రత విశిష్టతను చాటుతున్నాయి.

'ధ్యాయేన్నిత్యం రజతగిరి నిభంచారుచన్ద్రావతంసం
రత్నాకల్పోజ్వలా జ్గం పరశుమృగవరాభీతి హస్తం
ప్రసన్నం
పద్మాసీనం సమన్తాత్‌స్తుతమమరగణైర్వ్యాఘ్రకృత్తింవసానం
విశ్వాద్యంవిశ్వ బీజం నిఖిల భయహరం పఞ్చవక్త్రం
త్రినేత్రమ్'.

(వెండికొండవలెప్రకాశించువాడును, సుందరమగు చంద్రుడు శిరోభూషణముగా గలవాడును, రత్నాలంకారములచే ఉజ్వలమైన దేహము గల వాడును, గొడ్డలి, మృగము, అభయము చేతులయందు ధరించిన వాడును, ప్రసన్నవదనుడును, పద్మాసనమునందు కూర్చున్నవాడునూ, ఎల్లెడల దేవతలచే స్తుతించ బడువాడునూ, పులిచర్మమును, వస్త్రముగా ధరించువాడును, ప్రపంచమునకు ఆదిపురుషుడునూ, బీజస్వరూపుడునూ, సమస్త భయములను పోగొట్టువాడునూ, ఐదుముఖములు గలవాడునూ, త్రినేత్రుడునూ అగు పరమశివుని సదా ధ్యానించుచున్నాను.)

**— జయా సౌజన్యమూర్తిశ్రీ**